## క్లుప్తంగా

### జగనన్న కాలనీ స్థలం పరిశీలన



జగనన్న కాలనీ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

**బేతంచెర్ల:** నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామస్తులకు కేటాయించిన జగనన్న కాలనీ స్థలాన్ని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు శుక్రవారం పరిశీలించారు. గ్రామస్తులకు కేటాయించిన స్థలం గ్రామానికి దూరంగా ఉండడంతో పరిశీలించినట్లు వారు తెలిపారు. స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ శేఖర్, గోపాల్, సర్వేయర్ అన్నారావు ఉన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

**బేతంచెర్ల:** పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన సాయి శశాంక్ (18) గురువారం ప్యాపిలి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతదేహానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

### పాఠశాలకు విరాళం



హెచ్ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

**డోన్:** కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో ప్రింటర్ కొనుగోలు కోసం రోటరీక్లబ్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి శుక్రవారం రూ.6వేలను విరాళంగా అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ లోకనాథరెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, రోటరీక్లబ్ సభ్యులు మల్లారెడ్డి, కార్యదర్శి నాయక్, జింకల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



చిరంజీవిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**డోన్:** వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన దొరపల్లె చిరంజీవిని పార్టీ కార్యకర్తలు శుక్రవారం సత్కరించారు. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి గుర్తింపు లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు విజయ్, మధు, శంకర్, విజయ్‌కుమార్, సుధాకర్, మహేష్ ఉన్నారు.

### డీఎస్సీ విడుదల చేయాలి

**డోన్ టౌన్:** మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు నక్కి హరి, హబీబ్‌బాషా కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మాట్లాడారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

### ఆకతాయిలకు జైలు శిక్ష

**నంద్యాల(వ్యవసాయం):** పట్టణంలో మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన తలారి ధనుష్, షేక్ రియాజ్‌కు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేశారని పోలీసు సిబ్బంది శుక్రవారం తెలిపారు. దనుష్‌కు ఐదు రోజులు, షేక్ ఫయాజ్‌కు రెండు రోజులు శిక్షను ఖరారు చేశారని వివరించారు

### మదీనా యాత్రకు ముస్లింలు



మదీనా యాత్రకు సిద్ధమైన ముస్లింలు

**బేతంచెర్ల:** పట్టణానికి చెందిన ముస్లింలు మక్కా మదీనా యాత్రకు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. వీరిలో మత పెద్దలు ముఫ్తి అజ్మతుల్లా, సుబహాన్, అబ్దుల్లా, అబ్దుల్ రహిమాన్, చాంద్ బాషా, అబ్దుల్ సుఖూర్‌లతో పాటు 10 మంది మహిళలు ఉన్నారు.

### అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ

**డోన్ టౌన్:** పట్టణంలోని పాత బస్టాండ్ వద్దనున్న విజయవాడ కనక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

---

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయి. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. గత టీడీపీ హయాంలో గ్రామల అభివృద్ధిని గాలికొదిలేశారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అన్న మహాత్మా గాంధీ కలను సాకారం చేస్తూ.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అవుకు మండలం మెట్టుపల్లె గ్రామమే ఇందుకు ఓ సాక్ష్యం.



సుందరంగా మెట్టుపల్లె ప్రాథమిక పాఠశాల

# ప్రగతి బాటలో మెట్టుపల్లె

- సచివాలయ పరిధిలో రూ.5.27 కోట్లతో అభివృద్ధి పనులు
- బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.10.66 కోట్లు
- పాఠశాలకు కొత్త రూపు
- తాగునీటి సమస్యకు పరిష్కారం
- కష్టాలు తీరాయని గ్రామస్తుల హర్షం



రూ.30 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్





**అవుకు:** అవుకు మండలం మెట్టుపల్లె పంచాయతీ పరిధిలో కోనాపురం, రామవరం, లింగంబోడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సరైన రోడ్డు వసతి లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గర్భిణులు ప్రసవం కోసం ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే వారి బాధ వర్ణనాతీతంగా ఉండేది. ఇది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాల్లో రోడ్ల దుస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రాంత ప్రజల అవస్థలు తీరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందాయి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని రహదారులను సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చారు. గ్రామాల్లో గుంతలమయంగా ఉన్న దారులను సీసీరోడ్లుగా వేశారు. అంతేకాకుండా మనబడి నాడు–నేడుతో గ్రామంలోని పాఠశాలలను మునుపెన్నడూ చూడని విధంగా కార్పొరేట్ పాఠశాలను తలపించేలా సర్వాంగసుందరంగా తయారు చేశారు. గ్రామంలో సకల సేవలు అందాలనే ఉద్దేశంతో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మించి త్రాగునీటి కష్టాలకు చెక్ పెట్టారు.



మెట్టుపల్లె గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు

### సమస్యల నుంచి విముక్తి



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక ఎన్నో ఏళ్ల ఇబ్బందులు పడ్డాం. గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినప్పుడు ఈ రోడ్లలో ప్రయాణించేందుకు చాలా భయపడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మా గ్రామ సమస్యలకు విముక్తి లభించింది. బీటీ రోడ్డు నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

–గోకిరెడ్డి కదిరిరెడ్డి, కోనాపురం

### గతానికి ఇప్పటికి ఎంతో తేడా



గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆయా గ్రామాల్లో నాయకులను ప్రసన్నం చేసుకుంటేనే పనులు జరిగేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలకు అతీతంగా ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేస్తోంది. మా గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. ప్రధానంగా రోడ్డు సమస్య తీరింది. ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు.

–మర్రిబోయిన పెద్ద గురవయ్య, రామవరం

### మెట్టుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి వివరాలు

- లింగంబోడు గ్రామానికి రూ.1.26 కోట్లతో 1.6 కి.మీ బీటీ రోడ్డు.
- కోనాపురం గ్రామానికి రూ. 1.7 కోట్లతో 1.6 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణం
- గుండ్లశింగవరం నుంచి రామవరం మీదుగా మెట్టుపల్లెకు 10 కి.మీ పొడవునా రూ.7 కోట్లతో బీటీ రోడ్డు.
- అవుకు నుంచి మెట్టుపల్లెకు రూ.70లక్షలతో 3.5 కి.మీ రోడ్డు
- మెట్టుపల్లె సీసీరోడ్లకు రూ.53 లక్షలు, కోనాపురంలో రూ.34 లక్షలు
- మెట్టుపల్లె, కోనాపురం, రామవరం, లింగంబోడు గ్రామాల్లో గ్రావెల్ రోడ్లకు రూ.1.91 కోట్లు
- నాడు-నేడు పథకం ద్వారా మెట్టుపల్లె పాఠశాలకు రూ.18.2 లక్షలు, లింగంబోడు పాఠశాలకు రూ.19.5లక్షలు, కోనాపురం పాఠశాలకు రూ.12లక్షలు
- రూ.40లక్షలతో మెట్టుపల్లె గ్రామ సచివాలయం, రూ.21.8లక్షలతో రైతు భరోసా కేంద్రం
- జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.30 లక్షలతో మెట్టుపల్లెలో ఓవర్‌హెడ్ ట్యాంక్, కోనాపురంలో రూ.10 లక్షలు, రామవరంలో రూ.8 లక్షలు, లింగంబోడులో రూ.6లక్షలతో ఇంటింటికి తాగునీటి కొళ్లాయి కనెక్షన్లు.
- గడప గడపకు నిధులు రూ.84 లక్షలతో మెట్టుపల్లెతో పాటు మజారా గ్రామాల్లో అభివృద్ధి పనులు



అవుకు-మెట్టుపల్లె బీటీరోడ్డు

---

## గ్రామాల అభివృద్ధి ఘనత మంత్రి బుగ్గనదే



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ

**ప్యాపిలి:** గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేసిన ఘనత ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని కలచట్ల, చిన్నపొదిళ్ల, ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం 'మన కోసం బుగ్గన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంత్రి చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్యాపిలి మండలంలో మారుమూల గ్రామాలకు సైతం మంత్రి రోడ్డు సౌకర్యం కల్పించారని తెలిపారు. ప్యాపిలిలో నాలుగులైన్ల రహదారి విస్తరణ పనులు, పార్కు అభివృద్ధి, ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ తదితర కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. నంద్యాల నీటి పథకానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి 14 గ్రామాలకు నీరు అందించారని చెప్పారు. త్వరలోనే ఇంటింటికి మినరల్ వాటర్ అందించే పనులు చురుగ్గా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నపొదిళ్ల సర్పంచ్ వరలక్ష్మి, పార్టీ నాయకులు బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జయరామయ్య, రామమూర్తి, శివకుమారి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్
- ఉత్సాహంగా సాగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు

**డోన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలతో మెరికల్లాంటి క్రీడాకారులు బయటి ప్రపంచానికి తెలిసే అవకాశం ఉందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బాల,బాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వంశీకృష్ణ, ఎంఈఓ ప్రభాకర్, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

**క్రీడాస్ఫూర్తి పెరుగుతుంది**

**బనగానపల్లె/కొలిమిగుండ్ల:** ఆడుదాంఆంధ్రా పోటీల ద్వారా క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని ఎంపీపీ మానస వీణ అన్నారు. మండలంలోని పసుపల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ మోహన్ బాబు ఎంపీటీసీ మహేశ్వమ్మ పాల్గొన్నారు. ఇటు కొలిమిగుండ్ల మండలంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆటలను తిలకించేందుకు స్థానికులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

**–అవుకు:** అవుకు-2, గుండ్లశింగవరం, రామాపురం-2, శింగనపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల మైదానాల్లో క్రీడా పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీలో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ-1,2 శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

**–డోన్ రూరల్:** గ్రామీణ యువకులు క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. వెంకటాపురం గ్రామంలో క్రీడా పోటీలను బౌలింగ్ చేసి ప్రారంభించారు.



డోన్: బాలికల కబడ్డీ జట్టుతో మున్సిపల్ చైర్మన్ రాజేష్




డోన్: బాలుర జట్టు




బనగానపల్లె : కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

## అందరి సంక్షేమాన్ని కోరుకునేది హిందూ ధర్మం



కోలాటం ఆడుతున్న చిన్నారులు



పీఠాధిపతి పాండురంగనాథ భారతి

**కొలిమిగుండ్ల:** సమస్త జీవకోటి సుఖసంతోషాలు, సంక్షేమాన్ని కోరుకునేది హిందూ ధర్మమని పీఠాధిపతి పాండురంగనాథ భారతి స్వామి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక షిర్డీసాయి ఫంక్షన్ హాల్ నుంచి రుక్మిణి మాతాజీ, అనంతానంద భారతి స్వామితో పాటు వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాలు, ఆధ్మాత్మికవేత్తలతో కలిసి శ్రీరామ నామ జపం చేస్తూ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఠాధిపతి మాట్లాడుతూ.. మన ధర్మం విలక్షణమైందని, అందరి బాగు కోరుకుంటుందన్నారు. భగవంతుడిని చేరుకోవడానికి చిత్తశుద్ధి అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సామూహిక ఉత్సవాల్లో పాల్గొనడం, భజనలు చేయడం, పురాణ గాథలు వినడం తదితర ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. హిందూ ధర్మంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి మన ధర్మ సంరక్షణ కోసం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మనోహర్, నారాయణరెడ్డి, సాయి సృజన, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



కరీంబాగ్ కాలనీలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరిస్తున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కరీంబాగ్ కాలనీ, భారత్‌గ్యాస్ ఏరియా, నవాబు కోట ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. తమకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే వద్ద హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాల పథకం ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి జరిగిందని తెలిపారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని సూచించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోసారి సీఎం వైఎస్ జగన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. పథకాల వల్ల అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. గత టీడీపీ పాలన.. ప్రస్తుత పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఎంఈఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, జెడ్పీటీసీ లక్ష్మీ సుబ్బమ్మ,మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, అల్లిహుస్సేన్(అనిల్), జనార్దన్‌రెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నూకల వెంకట సుబ్బయ్య, మద్దిలేటి రెడ్డి, మహబూబ్‌బాషా, నారాయణ రెడ్డి, గాజులపల్లి, నరసింహారెడ్డి, బాలరాజు, చాకలి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డు నిర్మాణ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి

**బేతంచెర్ల:** పట్టణంలో మార్కెట్ యార్డు ఏర్పాటుతో రైతులకు కష్టాలు తీరనున్నాయని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. కొలుములపల్లె రహదారిలో రైతుల సౌకార్యర్థం మంత్రి బుగ్గన చొరవతో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న మార్కెట్ యార్డు నిర్మాణ పనులను కమిషనర్ రమేష్ బాబుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పనులు పూర్తయితే బనగానపల్లె, డోన్, నంద్యాల, కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

## బేతంచెర్ల విద్యార్థిని ప్రతిభ



వెంకటలీలను అభినందిస్తున్న ప్రిన్సిపల్

**బేతంచెర్ల:** నంద్యాలలోని శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ విలువలు పెంపొందించడంలో విద్య పాత్ర అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో బేతంచెర్ల విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించింది. ఆమెను శుక్రవారం జ్ఞాన సరస్వతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు అభినందించారు.

## సీపీఎం నుంచి షమీమ్ బేగం తొలగింపు

**డోన్ టౌన్:** పట్టణంలోని శ్రీరాంనగర్ శాఖ సీపీఎం కార్యదర్శి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షమీమ్ బేగంను తొలగించినట్లు ఆ పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు కొయిలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె పార్టీ నిబంధనలకు విరుద్ధంగా స్వప్రయోజనాలకు పాల్పడుతున్నందున జిల్లా కమిటీ నిర్ణయం మేరకు బాధ్యతల నుంచి తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

## 3న సామాజిక తనిఖీ బహిరంగ సభ

**కోవెలకుంట్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జనవరి 3వ తేదీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పథక పనులు, పంచాయతీరాజ్, సర్వశిక్ష అభియాన్, సామాజిక భద్రతా పింఛన్లు తదితర పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిపై జనవరి 3వ తేదీ బహిరంగ చర్చ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## యువకులపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

**ప్యాపిలి:** స్థానిక శ్రీరామ్ టాకీస్ ఆవరణలో శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన కళ్యాణ్, నవీన్, ప్రవీణ్‌పై అదే కాలనీకి చెందిన రమేశ్, ఓబులేసు, ఉసేన్, రాజశేఖర్ తదితరులు రాడ్‌తో దాడి చేసి గాయపర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. పాత కక్షల కారణంగా దాడి జరిగినట్లు చెప్పారు.

## వేడుకగా పల్లకి సేవ



పల్లకిపై ఊరేగుతున్న చౌడేశ్వరిదేవి

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకి సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ రామానుజన్ పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



సంజామలలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

**సంజామల:** స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం నూతన క్యాలెండర్లను ఎంఈఓలు రాజయ్య, ఈశ్వరయ్య ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి జి.మాధవిలత, ఉపాధ్యాయులు సురేష్, రాంపుల్లా రెడ్డి, లలిత, కుసుమ, రమాదేవి, లక్ష్మీదేవి, నజియ, శారద పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఖాజీగా నియామకం



మహబూబ్ ఖాన్ మిఫ్తహి

**ప్యాపిలి:** స్థానిక జామియా మసీదులో ఇమామత్ నిర్వహిస్తున్న హఫీజ్ మహబూబ్ ఖాన్ మిఫ్తహి ప్రభుత్వ సర్ ఖాజీగా నియమితులయ్యారు. ఈ మేరకు తనకు ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్యాపిలితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలకు ఆయన ఖాజీగా వ్యవహరిస్తారు. ముస్లింల వివాహాలు జరిపించడంతో పాటు వివాహ ధృవీకరణ పత్రాన్ని ఖాజీ హోదాలో జారీ చేస్తారు. ఆయన్ను పలువురు అభినందించారు.